క్లుప్తంగా

జిల్లా కమిటీ ఎన్నిక



గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయిలో పీఎస్‌హెచ్‌ఎంఏ టీజీ(ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్) జిల్లా అడహాక్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నల్ల రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా కొర్ర రఘురాం, ఉపాధ్యక్షుడిగా సుత్రాల రవి, ప్రధాన కార్యదర్శిగా ములకాల వెంకటస్వామి, కోశాధికారిగా వేణుగోపాల్, కార్యదర్శులుగా ఉమాదేవి, జజ్జరి నాగేశ్వరరావు, కొంపెల్లి సతీష్, పత్తి నటరాజ్, చంద్ర సింగ్, మీడియా కార్యదర్శిగా దేవదానం ఎన్నికయ్యారు. అలాగే మహిళా ఉపాధ్యక్షురాలిగా స్వర్ణలతను నియమించారు.

నియామకం



ములుగు: ములుగు మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పావనిని నియమిస్తూ డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి నియామక పత్రాన్ని అందించారు. తన నియమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పావని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్ , కార్యదర్శి కోగిల రాంబాబు పాల్గొన్నారు.

చర్య తీసుకోవాలి

వెంకటాపురం(కె): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ ఎమ్మెల్యే విక్రమ్ మండవి అన్నారు. శుక్రవారం ఆయన బెస్తగూడెం గ్రామంలో బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన బీజేపీ నాయకుడిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంకటాపురం సీఐ బండారి కుమార్‌తో మాట్లాడి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు సైయ్యద్ హుస్సేన్, చిడెం శివ, మన్నెం సునీల్, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

ఏటూరునాగారం: మండల పరిధిలోని చల్పాక గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో తాటి సమ్మయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి మృతుడి బాల్య స్నేహితులు రూ.10వేలను ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు పాడెం సమ్మయ్య, ప్రాడెం ప్రసాద్, చింత లక్ష్మయ్య, పోశయ్య, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఇసుక లారీలతో ప్రమాదాలు

- అతి వేగమే ప్రధాన కారణం
- పట్టించుకోని అధికారులు
- నివారణ చర్యలు శూన్యం

వాజేడు: మండలంలో ఇసుక లారీల వలన నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో ఉన్న ఇసుక క్వారీలకు వచ్చి వెళ్లే సందర్భాల్లో కొన్ని లారీలు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇసుకను తీసుకు వెళ్లే సమయంలో క్వారీకి త్వరగా వెళ్లి సీరియల్లో పెట్టుకోవాలనే కారణంతోనో తెలియదు కాని ఓవర్ స్పీడ్‌గా వెళ్తున్నారు. ఈ క్రమంలో ముందు ఉన్న వాహనాలను దాటడం కోసం ఎదురుగా వస్తున్న వాహనాలను, పాదచారులను చూడకుండా తగిలించిన సందర్భాలు చాలానే ఉన్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ప్రమాదానికి గురైన సందర్భాల్లో వాహనదాల తప్పు లేక పోయినా లారీల వల్ల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో ఇసుక లారీల మూలంగా చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల మండల పరిధిలోని ప్రగళ్లపల్లి గ్రామం వద్ద ముందు ఉన్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున ద్విచక్రవాహనదారుడిని ఇసుక లారీ ఢీ కొనడంతో ప్రాణాపాయ స్థితికి వెళ్లాడు. అలాగే మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద ఇసుక లారీ ఢీకొన్న సంఘటనలో మండపాకకు చెందిన యువకుడు మృత్యువాత పడ్డాడు. మొరుమూరు కాలనీ వద్ద వృద్ధురాలును ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సుందరయ్య కాలనీ వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న దంపతులను ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.



రోడ్డు ప్రమాదంలో దెబ్బ తిన్న లారీ(ఫైల్)



వాహనాలకు దారి ఇవ్వని ఇసుక లారీలు(ఫైల్)

నివారణ చర్యలు శూన్యం

ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు తనిఖీలు, హెచ్చరికలు చేసి తర్వాత పట్టించుకోక పోవడంతో మళ్లీ అదే పరిస్థితి. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఇక్కడ చాలా మందికి రహదారికి సంబంధించిన నిబంధనలపై అవగాహన ఉండక పోవచ్చు. అధికారులు ఓవర్ స్పీడ్‌తో వెళ్లే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో ప్రమాదాలు జరుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ప్రత్యేక చర్యలను తీసుకోవాలని కోరుతున్నారు.



ఇసుక లారీ ఢీకొనడంతో జగన్నాథపురం జంక్షన్ వద్ద దెబ్బ తిన్న డివైడర్

వేగాన్ని నియంత్రించాలి



ఇసుక లారీలు వేగంగ రావడం మూలంగా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాలి. ప్రమాదాలు జరుగకుండా చూడాలి.

– ముడిగె రాజు, వాజేడు

ముస్తాబవుతున్న రామాలయం



రామాలయం ఆవరణలో వేసిన చలువ పందిళ్లు

- రాములోరి కల్యాణానికి సిద్ధం చేస్తున్న నిర్వాహకులు

ఏటూరునాగారం: శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి మండల కేంద్రంలోని రామాలయం ముస్తాబైంది. ఆదివారం నిర్వహించే కల్యాణమహోత్సవానికి ఆలయ కమిటీ చైర్మన్ అలవాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అంతా సిద్ధం చేశారు. కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కల్యాణ మండపం చుట్టూ చలువ పందిల్లు వేశారు. కల్యాణాన్ని తిలకించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి వసతితో పాటు సీతారాములను దర్శించుకోవడానికి క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకుడు నాగేశ్వర రావుశర్మతో పాటు మరో నలుగురు వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం నుంచి కల్యాణం మహోత్సవం ప్రారంభం కానుంది. కల్యాణానికి వచ్చే ప్రతి భక్తునికి తలంబ్రాలు అందించేందుకు కమిటీ ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. ఇందులో కలిపేందుకు భద్రాచల రామయ్య ఆలయం నుంచి గోటి తలంబ్రాలను తీసుకువచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు మహా అన్నదానం ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం బలిహరణ దొంగల దోపు, మంగళవారం పుష్పయాగం, బుధవారం వసంతోత్సవంతో కల్యాణ మహోత్సవ ఘట్టం ముగియనుంది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని విమార్ట్ యాజమాన్యం, సిబ్బందికి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా పాటించాల్సిన జాగ్రత్తలపై ఫైర్ స్టేషన్ అధికారి సత్తయ్య శుక్రవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ములుగు డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ 87126 99164, ఏటూరునాగారం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 87126 85775, ఏటూరునాగారం ఫైర్ స్టేషన్ 87126 85772 నంబర్లకు ఫోన్ చేయాలని సత్తయ్య సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాలు ప్రతీ శుక్రవారం మండల కేంద్రంలోని షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాల్స్, జన సమూహాలు కలిగిన ప్రాంతాల్లో నిర్వహిస్తామని లీడింగ్ ఫైర్ మాన్ సీహెచ్.రవికుమార్ తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో సత్తయ్య, రవికుమార్‌లతోపాటు సిబ్బంది శ్రీకాంత్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి

వెంకటాపురం(కె): అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లాలో కురిసిన వర్షానికి వేలాది ఎకరాల్లో మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ, అగ్రికల్చర్ శాఖలు తక్షణమే పంట నష్టం సర్వే చేసి పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి, దావూద్, గ్యానం వాసు, కట్ల నర్సింహాచారి, రఘుపతి, చిట్టిబాబు, రాజేష్, చిరంజీవి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

లలితాదేవికి అభిషేకాలు



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో లలితాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి ఉత్సవ విగ్రహానికి పంచామృత అభిషేకాలను అర్చకులు యల్లాప్రగఢ నాగేశ్వర్‌రావుశర్మ, మణికంఠ శర్మ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దుర్గామాతభక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అభిషేక కార్యక్రమం , కుంకుమ పూజ, లలితసహస్రనామాన్ని పఠించారు. కార్యక్రమంలో మహిళలు, రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వారసంత నిర్వహణకు వేలం

- రూ.2.73 లక్షల ఆదాయం

మంగపేట: మండలంలో కమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కూరగాయల వారసంత (తైబజారు) వేలం పాట ద్వారా రూ.2.73 లక్షల ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి కిశోర్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ప్రతి సోమవారం నిర్వహించే తైబజారుకు వసూలు చేసే అనుమతి పొందెందుకు వేలం పాటను ఎంపీఓ మమత, పంచాయతీ కార్యదర్శి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. వేలం పాటలో ఏడుగురు గుత్తేదారులు పోటీ పడ్డారు. గోవిందరావుపేట మండలం పస్ర గ్రామానికి చెందిన చెరుకుల సురేష్ అంగడి నిర్వహణను దక్కించుకున్నారు. పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రంజిత్, వేలంపాటదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెసా నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణ

తైబజారుపై నిర్వహించిన వేలం పాటలో అధికారులు పెసా నిబంధనలను ఉల్లంఘించారని పలువురు ఆరోపించారు. వేలం పాటను పెసా నిబంధనల మేరకు నిర్వహించనున్నట్లు ముందు రోజు ప్రకటించిన అధికారులు పంచాయతీ స్పెషలాఫీసర్ లేకుండా ఎలా నిర్వహిస్తారంటు ప్రశ్నించారు. పెసా నిబంధనల ప్రకారం స్థానిక గిరిజనులకు మాత్రమే వేలం పాటలో పాల్గొనాలనే నిబంధనలు ఉన్నప్పటికి స్థానికేతరులకు అవకాశం కల్పించడం ఏంటని నిలదీశారు. దీనిపై పంచాయతీ అధికారులు నిబంధనల మేరకే వేలం పాట నిర్వహించామంటూ వేలం పాటను ముగించారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

రాళ్ల వాగు వద్ద నిలిచిన రాకపోకలు



రాళ్ల వాగు వద్ద నిలిచి పోయిన వాహనాలు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర పంచాయతీ రాళ్ల వాగు వద్ద శుక్రవారం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం రాత్రి మండలంలో కురిసిన వర్షానికి రాళ్ల వాగు సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వెంకటాపురం మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ అధికారులు బస్సులను మణుగూరు, ఏటూరునాగారం మీదుగా మళ్లించారు. ఇసుక లారీలు, కార్లు వాగు దాటి వచ్చేందుకు వీలు లేక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం తర్వాత కార్లు, లారీలు వాగు దాటి వచ్చాయి. ఇప్పటికైన అధికారులు కుంగిపోయిన రాళ్ల వాగు బ్రిడ్జికి మరమ్మతులు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. చిన్న వర్షానికే ఇబ్బందులు తలెత్తితే వర్షాకాలం సీజన్‌లో అవస్థలు పడాల్సి వస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ములుగు రూరల్: విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ బానోత్ రవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని జంగాపల్లిలో అధికలోడ్‌తో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెపాసిటర్ బిగించడం వల్ల కలిగే లాభాలను, ఎలక్ట్రికల్ పరికరాల ఎర్తింగ్ పద్ధతులును అందించిడం వల్ల రక్షణ పొందడంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ బావుల వద్ద ఆటోమెటిక్ స్టార్టర్ల వల్ల కలిగే నష్టాలను, విద్యుత్ సర్వీస్ వైరు నాణ్యత, ప్రామాణికత వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ హరీష్, లైన్‌మెన్ జీవన్, ఏఎల్‌ఎం రాజేశ్వర్‌రావు, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

- ఎస్సై తాజుద్దీన్

ఏటూరునాగారం: డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ఎస్సై తాజుద్దీన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని శంకరాజ్‌పల్లి గ్రామంలో డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. గామాల్లో ఎవరైన డ్రగ్స్ విక్రయిస్తున్నారని తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. డ్రగ్స్ అమ్మిన కొనుగోలు చేసిన చట్టపరంగా నేరమని అన్నారు. పోలీసులు తదితరులు ఉన్నారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

వడదెబ్బ తగులకుండా జాగ్రత్తగా ఉండాలి



పంపిణీ చేసిన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో విద్యార్థులు

వాజేడు: వేసవిలో వడదెబ్బ తగులకుండా జాగ్రత్తగా ఉండాలని పేరూరు హెచ్‌ఈఓ పాయం వేణుగోపాల కృష్ణ తెలిపారు. మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల నొప్పి, జ్వరం, కళ్లు తిరుగడం, వాంతులు, విరేచనాలు, కాళ్లు తిమ్మిర్లు రావడం, శ్వాస వేగం పెరగడం, మూత్రం పసుపు రంగులో రావడం లాంటి లక్షణాలు ఉంటే వడ దెబ్బ తగిలినట్లు గుర్తించాలన్నారు. వెంటనే దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సగీత, శకుంతల, శ్రీను, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్ట్

ఏటూరునాగారం: మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన మండపు సమ్మయ్యను హత్య చేసిన అతడి భార్య స్వప్నను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. భార్యభర్తలు ప్రతిరోజూ మద్యానికి తరచూ గొడవ పడుతూ ఉండేవారని తెలిపారు. కాగా మద్యం మత్తులో భర్తను తీవ్రంగా కర్రతో కొట్టడంతో చనిపోవడం జరిగిందని అన్నారు.



వెలవెలబోతున్న ఆపరేషన్ థియేటర్



ఖాళీగా ఉన్న ఆస్పత్రిలోని పిల్లల వార్డు

వైద్యం అందట్లే..!

- చిట్యాల సివిల్ ఆస్పత్రిలో వైద్యుల కొరత
- 18మందికి ఉన్నది కేవలం ఆరుగురే..
- గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు అసలే లేరు..
- ఏడు నెలలుగా ఒక్క ప్రసవం లేదు..

చిట్యాల: వైద్యుల కొరతతో చిట్యాల సివిల్ ఆస్పత్రిలో వైద్యం అందడం లేదు. 18మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్యులు లేకపోవడంతో ఏడు నెలలుగా ఆస్పత్రి ఒక్క ప్రసవం కూడా జరగలేదు. ఆస్పత్రికి ఏ సమస్యతో వచ్చినా రోగులకు మాత్రం వైద్యం అందే పరిస్థితి లేదు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి వైద్యులను నియమిస్తేనే రోగులకు వైద్యం అందే పరిస్థితి ఉంది.

చిట్యాల సివిల్ ఆస్పత్రిని బీఆర్‌ఎస్ ప్రభుత్వం 30 పడకల నుంచి 50 పడకలకు పెంచింది. కానీ అందుకు తగ్గట్లు వైద్యులను మాత్రం నియమించలేదు. దీంతో ఉన్న వైద్యులతోనే కాలం వెళ్లదీసుకుంటూ వచ్చారు. ఆస్పత్రిలో 18మంది వైద్యులు ఉండాల్సి ఉండగా కేవలం ఆరుగురు మాత్రమే ఉన్నారు. 12మంది వైద్యుల కొరత ఉంది. ఉన్న వైద్యులపై భారం పడుతోంది. ఆస్పత్రికి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో వస్తున్న రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదు. దీంతో అనేక మంది జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి వెళ్తున్నారు. గైనకాలజిస్ట్, పిల్లల డాక్టర్లు లేక ఏడు నెలలు అవుతుంది. దీంతో గర్భిణులు, చిన్నపిల్లలకు వైద్యం అందడం లేదు. ఏడు నెలలుగా ఆస్పత్రిలో ఒక్క డెలివరీ చేయలేదు.



చిట్యాలలోని సివిల్ ఆస్పత్రి



నిరుపయోగంగా ఉన్న పిల్లల బరువు కొలిచే యంత్రం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉంది. ఏడు నెలలుగా గైనకాలజిస్ట్, పిల్లల వైద్యులు లేరు. దీంతో పూర్తిగా వైద్యసేవలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినం.

– శ్రీకాంత్, ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలి

టేకుమట్ల: లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని ఎంపీడీఓ అనిత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి ముగ్గు పోయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొదటి విడతలో ఎంపికైన లబ్ధిదారులు తప్పని సరిగా ఇంటి నిర్మాణాన్ని చేట్టాలన్నారు. బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన వెంటనే వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందని అన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి సాంబశివుడు, లబ్ధిదారులు ఉన్నారు.



ముగ్గు పోయిస్తున్న ఎంపీడీఓ అనిత